క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



గుడివాడ టౌన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహనాలకు స్టిక్కర్లు అంటించారు. వాహన వినియోగదారులకు ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గులాబీపూలను ఇచ్చి ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలని కోరారు. దీని వలన అందరూ క్షేమంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు అర్జా ప్రసాదు, కార్యదర్శి వంగపండు బ్రహ్మాజీ, కోశాధికారి చింతా రామకృష్ణ, క్లబ్ సభ్యులు లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, బొగ్గారపు తిరుపతయ్య, ఎం.శివరామకృష్ణ, చిట్టిబాబు, బసవేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



ముదినేపల్లి రూరల్: వరి సాగులో సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండవల్లి సబ్ డివిజన్ ఏడీఏ జి.వెంకట మణి అన్నారు. మండలంలోని వడాలి, పెయ్యేరు గ్రామాల్లో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యాన సమగ్ర సస్యరక్షణపై శిక్షణ కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. స్థానిక పొలాలను పరిశీలించి పాము పొడతెగులు సోకడాన్ని గమనించారు. దీని నివారణకు హెక్సాకోనాజోల్ మందును ఎకరానికి 400 మిల్లీ లీటర్ల వంతున పిచికారీ చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్, పెయ్యేరు, వడాలి రైతుభరోసా కేంద్రాల ఇన్‌చార్జులు అజయ్ కుమార్, దివ్య, రైతులు పాల్గొన్నారు.

మహిళ నేత్రదానం



ముదినేపల్లి రూరల్: మహిళ మరణానంతరం ఆమె కోరిక మేరకు కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు. స్థానిక అంబేడ్కర్ కాలనీకి చెందిన చింతల సౌందర్యమ్మ (63) అనారోగ్యంతో హైదరాబాదులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించింది. తన కళ్లను దానం చేయాలని ముందుగానే కుమారులకు చెప్పడంతో తల్లి కోరిక మేరకు కుమారులు దయానందరాజు, సుబ్రహ్మణ్యం హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు సమాచారమిచ్చారు. ఈ మేరకు సౌందర్యమ్మ నేత్రాల నుంచి కార్నియాలను సేకరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె అంత్యక్రియలు ముదినేపల్లిలో బుధవారం నిర్వహించారు.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు



గుడ్లవల్లేరు: కౌతవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ వినియోగిస్తున్న గృహాలు, వాణిజ్య సముదాయాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. 48 బృందాలుగా 3,031 సర్వీసులను తనిఖీ చేసినట్లు విజిలెన్స్ ఎస్ఈ ఎం.అల్ఫాన్స్ తెలిపారు. తనిఖీ చేసిన సర్వీసుల్లో 273 సర్వీసులకు అదనపు లోడు కింద రూ.8 లక్షల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో గుడివాడ ఈఈ టి.రామకృష్ణ, కౌతవరం ఏఈ కె.సుబ్బారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డికి సత్కారం



కైకలూరు: స్థానిక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రఘునాథరెడ్డిని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం సత్కరించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యాన ఉన్నత ప్రమాణాలు కల్గిన నాక్ ఎ+గ్రేడ్‌ను ప్రభుత్వ కళాశాల సాధించింది. ఇందుకు గాను ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డిని విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మంత్రి బొత్స ప్రశంసా పత్రం, అవార్డును అందించి శాలువాతో సత్కరించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి ఉన్నత విద్యామండలి కమిషనర్ హేమచంద్రారెడ్డి, కళాశాల అధ్యాపకుడు ఆర్.జలబాబు, నాక్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ఇమ్మానియేలు, పాల్ దివాకర్ హాజరయ్యారు.

ప్రజారోగ్య రక్షణే సీఎం జగన్ ధ్యేయం



చటాకాయలో ఆరోగ్య కార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్



చటాకాయలో మందుల కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

కైకలూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చినట్లు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. మండలంలోని చటాకాయ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యమే మహాభాగ్యమనే మాటను అక్షరాల నిజం చేసేందుకు ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు. శిబిరంలో కౌంటర్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఎంపీపీ అడవి వెంకట కృష్ణమోహన్, జెడ్పీటీసీ సభ్యురాలు కురెళ్ళ బేబి, సర్పంచ్ ఘంటశాల శేషారావు, ఎంపీటీసీ సభ్యురాలు సైదు లక్ష్మి, ఉప సర్పంచ్ ఘంటసాల చిన్న సుబ్బారాజు, పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కైకలూరు(కలిదిండి): ప్రజల ఆరోగ్య పరిరక్షణే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని సానారుద్రవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్రజల ముంగిటే వైద్య సేవలందిస్తున్నట్లు చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకుని ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, వైస్ ఎంపీపీ కనకదుర్గా రాణి, ఎఎంసీ ఉపాధ్యక్షుడు పాము రవికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు తిరుమాని రమేష్, కొల్లాటి సత్యనారాయణ, సర్పంచ్ నున్న రాజేశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సీతామహాలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు వర్జాని పార్థసారధి, ఉప సర్పంచ్ నున్న రాంబాబు పాల్గొన్నారు.

మండవల్లి: మండలంలోని లోకుమూడి గ్రామ సచివాలయ పరిధిలో జెడ్పీ హైస్కూల్ వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఇంటింటినీ జల్లెడ పట్టి ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా, గుర్తించి వారికి సరైన వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఇది దేశంలోని ఏ రాష్ట్రంలో జరగని విధానం. ఏపీలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని పేర్కొన్నారు. మళ్లీ సీఎంను ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, వైఎస్ఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బలే నాగరాజు, లోకుమూడి, చావలిపాడు సర్పంచ్‌లు కరేటి నాగమణి, తలారి ధనలక్ష్మి, మునునూరి శ్రీనివాసరావు, తలారి సత్యనారాయణ, ఉప సర్పంచ్ దత్తాడ జాన్ సుబ్బారావు, మాజీ ఎంపీపీ ముంగర గోపాలకృష్ణ, చావలిపాడు శ్రీను, తోకల ప్రభుదాస్, తోకల అంబేద్కర్, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఎంపీడీఓ సీకే వెంకట రమణ, పీహెచ్‌సీ, ఏలూరు ఆశ్రం ఆస్పత్రి వైద్యులు, గుంటూరు వైద్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మేలు

పమిడిముక్కల: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని జెడ్పీటీసీ యేనుగ వెంకట రమణకుమారి అన్నారు. లంకపల్లి పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ సర్పంచ్‌లు వేమూరి రత్నకుమారి, దిమ్మెట పద్మావతిలతో కలిసి ప్రారంభించారు. జనరల్, గైనిక్, ఈఎన్‌టీ, రక్తపరీక్షల వార్డులను పరిశీలించి, వైద్యులను వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన పోషకాహార పదార్థాల స్టాల్‌ను పరిశీలించి, తక్కువ ఖర్చుతో పోషక విలువలు కలిగిన పదార్థాలను తయారు చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలను అభినందించారు. వైద్య శిబిరంలో 410 మంది రోగులకు వైద్యులు అఖిల, ఎస్‌కే సైరాకటూన్, బాలాజీ పరీక్షలు చేసి, మందుల కిట్లను అందజేశారు. తహసీల్దార్ విఠల్‌పాల్, ఈవోఆర్డీ వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయదుర్గ వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సజ్జాద్ అలీ, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, పార్టీ నాయకులు కొడాలి రాంబాబు, మారపాక మహేష్, యేనుగ మస్తాన్ రావు తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఎంతో మేలు కలుగుతోందని ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రొయ్యూరు ఎంపీయూపీ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం జరిగింది. తోట్లవల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సాయిప్రసన్న ఆధ్వర్యంలోని వైద్యబృందం 486 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. బీపీ, షుగర్, ఈసీజీ, కళ్లె పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా 119 మందికి ఉచితంగా కంటి పరీక్ష చేశారు. శిబిరాన్ని మండల ప్రత్యేకాధికారిణి, ఏపీ ఎంఐసీ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి పరిశీలించారు. సర్పంచ్ నిమ్మగడ్డ ప్రభుదాస్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా కన్వీనర్ మోర్ల రామచంద్రరావు, తహసీల్దార్ కుసుమకుమారి, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి మోర్ల పూర్ణప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు లుక్కా విజయ్, గ్రామ సచివాలయ కన్వీనర్ లుక్కా భరత్, పంచాయతీ కార్యదర్శి శైలజ, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

435 మందికి వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో పేద ప్రజలకు ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీఓ డి.శ్రీనివాస్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కింద వెణుతురుమిల్లిలో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న 435 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్ మస్తానా, వైఎస్సార్ సీపీ నాయకుడు చందన నాగంనాయుడు, ఈఓపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, డీటీ బి.కనకదుర్గ, సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: వైద్య రంగంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నూతన అధ్యాయమని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత దూలం ఆది వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని వాడవల్లిలో జగనన్న ఆ రోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించా రు. శిబిరంలో 320మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ రాచూ రి రాధ, ఎంపీటీసీ సభ్యురాలు దూసనపూడి లక్ష్మీకుమారి, సర్పంచ్‌లు శీలం రామకృష్ణ, సుధాబత్తుల రమణ, అర్జా రామజోగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కోమటి విష్ణువర్ధన్, దివి సతీష్, సుధాబత్తుల వంశీ, ఎంపీడీవో పి.మల్లీశ్వరి పాల్గొన్నారు.



లంకపల్లి వైద్య శిబిరంలో వివరాలు తెలుసుకుంటున్న జెడ్పీటీసీ రమణకుమారి



రొయ్యూరులో వృద్ధురాలికి మందుల కిట్‌ను అందజేస్తున్న ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ, అధికారులు



వెణుతురుమిల్లిలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

బాబా ఉరుసు మహోత్సవం

లక్ష్మీపురం (పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ శివారు లక్ష్మీపురంలో హజరత్ కరీముల్లా షా ఖాదర్ దర్గాలో బాబా ఉరుసు (గంధం)మహోత్సవాలను బుధవారం ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ముస్లింలు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలు నుంచి దర్గాలో ఉరుసు మహోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనాల్లో పాల్గొన్నావారి కోరికలు నెరవేరుతాయన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ అజీజ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనాలు చేశారు. ముస్లింలు ప్రత్యేక నమాజ్ ప్రార్థనల అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

మండవల్లి: మండలంలోని అల్లినగరం ఉరుసు మహోత్సవంలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ బుధవారం పాల్గొన్నారు. ఖాదర్ బాషా ఆహ్వానం మేరకు ఎమ్మెల్సీ విచ్చేసి ప్రార్థనలు చేశారు. ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తనయుడు హాజరు

అల్లినగరం ఉరుసు మహోత్సవానికి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరారావు(డీఎన్నార్) తనయుడు వీర ఆది వినయ్‌కుమార్ బుధవారం హాజరయ్యారు. సర్పంచ్ జె.వీరబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు జి.రామ్మోహనరావు, జి.సాయి, బాషా, జబ్బర్, బాజీ పాల్గొన్నారు.



ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్సీ వెంకటరమణ



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా కీర్తి

కైకలూరు: బీజేపీ కిసాన్ మోర్చ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా కైకలూరుకు చెందిన కీర్తి వెంకట రాంప్రసాద్ నియమితులయ్యారు.ఈ మేరకు జిల్లాఅధ్యక్షుడు విక్రమకిషోర్ బుధవారం ప్రకటన విడుదల చేశారు. రాంప్రసాద్ రెండోసారిబాధ్యతలు చేపడుతున్నారు. తనపై విశ్వాసంతో అధ్యక్షుడిగా నియమించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు విక్రమకిషోర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

దిశ చట్టంపై అవగాహన

గూడూరు: మహిళలకు రక్షణ కల్పించే దిశ చట్టంపై బుధవారం మల్లవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఎస్పీ పి.జాషువా ఆదేశాల మేరకు మచిలీపట్నం దిశ పోలీస్ స్టేషన్ మహిళా ఎస్ఐలు ఆర్.సుశీల, హేమలత దిశ యాప్, పోక్సో, బాల్య వివాహాలు నిరోధంపై అవగాహన కల్పించారు. ర్యాగింగ్‌ను అరికట్టడం, డ్రగ్స్ మహమ్మారిని రూపుమాపేందుకు విద్యార్థులు ముందుకు రావాల్సిన ఆవశ్యకతను వివరించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.అరుణ, ఉపాధ్యాయులు ఎన్.అరుణ, హెడ్ కానిస్టేబుల్ విమలకుమారి, లక్ష్మి పాల్గొన్నారు.

సమాచార చట్టంపై అవగాహన ఉండాలి

మండవల్లి: విద్యార్థి దశ నుంచే సమాచార చట్టంపై అవగాహన పెంచుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. గురువారం సమాచార హక్కు చట్టం 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కానుకొల్లు హైస్కూల్‌లో హెచ్‌ఎం ఎస్వై మాధవకుమార్ అధ్యక్షతన ఆర్టీఐపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. భాస్కరరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఇద్దరు విద్యార్థులు ప్రతి మూడు నెలలకు ఒక ఆర్టీఐ అర్జీ ద్వారా పంచాయతీలోని సమాచారాన్ని తీసుకుని ప్రజలకు తెలియజేస్తే క్రమంగా అవినీతి తగ్గుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆర్టీఐ ఇంగ్లిష్ అక్షరాల రూపంలో కూర్చుని ప్రదర్శించారు. ఐక్య వేదిక మండల అధ్యక్షుడు టి.అప్పారావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.శ్యాంప్రసాద్, పీడీ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.



ఆర్టీఐ అక్షరాల రూపంలో విద్యార్థులు

బెట్టింగ్ రాయుళ్లకు కౌన్సెలింగ్

కైకలూరు: క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వ్యక్తులకు కైకలూరు టౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐ ప్రతాప్‌రెడ్డి బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో గతంలో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి, వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి సీఐ ప్రతాప్‌రెడ్డి, ఎస్ఐ ఆకుల రఘు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ క్రికెట్‌ను ఒక క్రీడగా భావించి ఆనందించాలని, జూద క్రీడగా భావించరాదన్నారు. జీవితాలను నాశనం చేసుకోరాదన్నారు.

15 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



మచిలీపట్నంటౌన్: స్థానిక ఆజాద్ రోడ్డులోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో 15 నుంచి 23వ తేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆలయంలో బుధవారం శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ మాట్లాడుతూ ఆలయంలో 15వ తేదీ ఉదయం 8.30 గంటలకు ప్రథమ పూజలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతి రోజు పలు పూజా కార్యక్రమాలు, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు ఉంటాయని చెప్పారు. 20వ తేదీ మూలా నక్షత్రం సందర్భంగా బాలబాలికలచే సరస్వతి పూజలు, 24న కుమారిపూజలు, 25న వేదపండితుల సభ నిర్వహిస్తామని వివరించారు. ప్రతి రోజు ఆర్యవైశ్య సంఘం మహిళా విభాగం సభ్యులు లలితా సహస్రనామ పారాయణం చేస్తారన్నారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం తరువాత జిల్లాలో దసరా వేడుకలను కన్యకా పరమేశ్వరి ఆలయంలో తొమ్మిదిరోజుల పాటు వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఆలయ కమిటీ కార్యదర్శి ఎంవీ బాబాప్రసాద్, ఉపాధ్యక్షులు సామా వెంకటలక్ష్మీ కాంతారావు, సహాయ కార్యదర్శి బైసాని హయగ్రీవరావు తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్ నిర్మాణానికి స్థల పరిశీలన



లే అవుట్ వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: పామర్రు శివారు ప్రాంతంలో జగనన్న లే అవుట్ నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్ పీ రాజాబాబు, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో కలిసి బుధవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ 490 మంది లబ్ధిదారుల కోసం జగనన్న లే అవుట్ ఇంకా నిర్మించాల్సి ఉన్నదన్నారు. ఇప్పటికే 20 ఎకరాలు సేకరించామని, మరో 18 ఎకరాలు సేకరించాల్సి ఉందన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ భూ సేకరణకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం గ్రామంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ రోగులకు కావాల్సిన వసతులపై వైద్యులతో చర్చించారు. గతంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సామాజిక ఆరోగ్య కేంద్రంగా మారిందని, వచ్చే రోగుల కోసం ఐదారు ఓపీ గదులను కేంద్రం ఆవరణలో నిర్మించాల్సి ఉటుందని అన్నారు. ఈ పర్యటనలో కలెక్టర్, ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ భరత్‌రెడ్డి, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, జెడ్పీటీసీ కె.స్వరూపరాణి, డీఎల్‌డీవో నాంచారరావు, మండల సర్వేయర్ పర్వీన్ సుల్తానా, వైద్యులు సుదేష్‌బాబు, సురేష్, దీప్తి, బద్రీనాథ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే నానికి సత్కారం



ఎమ్మెల్యే కొడాలి నానిని సత్కరిస్తున్న యానాది కాలనీ వాసులు

గుడివాడ టౌన్: తరతరాలుగా రిజిస్ట్రేషన్ సమస్యలతో సతమతమవుతున్న యానాదుల కాలనీ వాసుల సమస్యలను పరిష్కరించడం గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) వలననే సాధ్యమైనదని కాలనీ వాసులు అన్నారు. బుధవారం రాజేంద్రనగర్ లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే కొడాలి నానిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా ప్రాంత ప్రజలు తరతరాలుగా 22ఎ సెక్షన్ కింద కేటాయించబడిన భూముల సమస్యతో సతమత మవుతున్నామన్నారు. దీని వలన మేము ఎంతో నష్టపోయామని తమ భూములను కొనేవారు లేక అమ్మకానికి ధరలు రాక ఆర్థికంగా నష్టపోయా మన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఈ సమస్యను ఒక సవాలుగా తీసుకుని పరిష్కరిస్తూ జిల్లా కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చే వరకు కృషి చేశారని తెలిపారు. ఇంతటి సహకారాన్ని అందించిన ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామని అన్నారు. వైఎస్సార్ సీపీ మైనార్టీసెల్ అధ్యక్షుడు షేక్ బాజీ, మైనార్టీ సెల్ నాయకులు షమ్ము, ఎస్‌కే సయ్యద్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- కొండిపర్రులో గడప గడపకు మన ప్రభుత్వం



లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

కొండిపర్రు(పామర్రు): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అందరూ సంతోషంగా ఉన్నారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని కొండిపర్రు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగున్నర ఏళ్ల పాలనలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించారు. బుక్‌లెట్‌లను అందజేశారు. సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారం చేపడుతూ ముందుకు సాగారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ ఇంటికి సంక్షేమపథకాల లబ్ధి చేకూర్చటమే ధ్యేయంగా ప్రభుత్వంపాలన చేస్తోందని అన్నారు.

రాజకీయాలను కుల మతాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ నవరత్న పథకాలను అందిస్తున్నామన్నారు. తొలుత స్థానిక దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు టీ శ్రీనివాసరావు, తలారి మహేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ మున్నంగి సత్యనారాయణరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ముప్పిడి సురేష్‌రెడ్డి, పార్టీ నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, సజ్జా సుబ్రమణ్యం, ఫణీంద్ర రెడ్డి, కాంతారెడ్డి, కూసం మల్లేశ్వరరెడ్డి, కూసం పెద వెంకటరెడ్డి, తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, ఎంపీడీవో వై.రామకృష్ణ, కార్యదర్శి ఆర్.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు ధైర్యం, సాహసం అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గుడివాడ టౌన్: బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలంటే ధైర్యం, సాహసం అవసరమని రెడ్‌క్రాస్ జిల్లా చైర్‌పర్సన్ స్పందన అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్‌క్రాస్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏఎన్నార్ కళాశాల ఉమెన్ డెవలప్‌మెంట్ సెంటర్ గుడివాడ ఎన్‌సీసీ విద్యార్థుల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బేటీ బచావో-బేటీ పడావో అనే నినాదంతో ప్రారంభమైన ఈ ర్యాలీని డీఎస్పీ శ్రీకాంత్ ప్రారంభించారు. సమాజం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కొంత మేరకు బాలికలకు స్వాతంత్ర్యం ఉన్నప్పటికీ కొన్ని సామాజిక వర్గాల్లో బాలికలపట్ల వివక్ష కొనసాగుతుందని డీఎస్పీ అన్నారు. బాలికల సంరక్షణకు అనేక చట్టాలు వచ్చాయని, అన్ని రంగాల్లో బాలికలు ప్రవేశించి తమ సత్తాను చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ మడకా ప్రసాదు, కోశాధికారి పునీందర్ కొఠారి, విఘ్నేశ్వరస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ గంటా చంద్రశేఖర్, ఎస్‌పీఎస్ హైస్కూల్ హెచ్‌ఎం టీఎంఈ రాణి, మున్సిపల్ పాఠశాలల మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ



బోనస్ అందిస్తున్న అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మేనేజర్ గోపీనాథ్ తదితరులు

పామర్రు: పాల ఉత్పత్తి దారులకు రూ.4 లక్షలను బోనస్‌గా అందజేశారు. స్థానిక చిన్నపాలకేంద్రంలో పాలఉత్పత్తిదారులకు బుధవారం నిర్వహించిన సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, పామర్రు పాలశీతల కేంద్రం మేనేజర్ చిట్టూరి దామోదర గోపీనాథ్ అందజేశారు. 2022-23 ఏడాదికి ఈ బోనస్ అందజేశామన్నారు. 335 మంది సభ్యులకు రూ.4,01,567లను బోనస్‌గా పంపిణీ చేశారు. అధికపాలు పోసినవారికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. తాళ్ల అంజిరెడ్డి, దేవనబోయిన వహాలక్ష్మి ప్రథమ, ద్వితీయ స్థానాలు పొంది రూ.12,098, రూ.10,851 వంతున నగదు పొందారు. పామర్రు పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మారెడ్డి నారాయణరెడ్డి, సూపర్‌వైజర్ కై లే రమేష్‌బాబు, సంఘ వేతన కార్యదర్శి ఆరేపల్లి శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.